గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఈనెల 26న గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పగడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరు క్యాంపు కార్యాలయలో గణతంత్ర దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లను సంబంధిత అధికారులు సమన్వయంతో తరగతిన పూర్తి చేయాలన్నారు. వేదిక, భారికేడింగ్ ఏర్పాట్లను ఆర్అండ్‌బి అధికారులు, తాగునీరు ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్ ఏర్పాట్లను మున్సిపల్ శాఖ అధికారులు చేపట్టాలన్నారు. జెసి జెవి.మురళీ మాట్లాడుతూ వివిధ శాఖలకు అప్పచెప్పిన విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

రైతులను మోసగించిన బిజెపి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

26న ట్రాక్టర్ల ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 26న అన్ని జిల్లాల్లో ట్రాక్టర్ ర్యాలీలు, ఏప్రిల్ ఐదో తేదీన పెద్దఎత్తున ఢిల్లీలో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య స్పష్టం చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం పూర్తి సంక్షోభంలో ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు లక్ష మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. వ్యవసాయ సంక్షోభానికి రైతుల ఆత్మహత్యలే ప్రతీకగా ఉన్నాయన్నారు. రైతులకు రెట్టింపు ఆదాయం తీసుకువస్తామని, కొత్త పద్ధతుల్లో వ్యవసాయరంగాన్ని ఆధునీకరిస్తామని, రూ.25 కోట్ల పెట్టుబడులు తీసుకువస్తామని చెప్పి మోడీ అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. అయితే నేటికి వివిధ పంటల వారీగా చర్చలుగానీ, రాష్ట్రాల వారీగా చర్చించి వ్యవసాయాభివృద్ధికి కావాల్సిన ప్రణాళిక రూపొందించలేదన్నారు. ఈ ప్రణాళికలు రూపొందించాల్సిందిపోయి, వ్యవసాయానికి, రైతులకు నష్టం చేసే మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చారని విమర్శించారు. దానికి వ్యతిరేకంగా రైతాంగం ఏడాది కాలంపాటు పోరాడి వాటిని తిప్పికొట్టిన చరిత్ర దేశ రైతాంగానికి ఉందన్నారు. ఒకవైపు వాటిని వెనక్కి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన వాటిని అమలు చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. విదేశాల నుంచి



మాట్లాడుతున్న కృష్ణయ్య

పంచదార, పాలు, ధాన్యం వంటివి దిగుమతి చేసుకుంటూ భారతదేశ రైతాంగాన్ని దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 750 జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించాలని అఖిల భారత కిసాన్ సభ నిర్ణయించిందన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగాన్ని రక్షించుకోవడం కోసం, స్వామినాధన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతుల పెట్టుబడికి అదనంగా 50 శాతం చెలించాలని, కనీస మద్దతు ధరల చట్టం పార్లమెంట్‌లో చేయాలని కోరుతూ ఏప్రిల్ ఐదో తేదీన ఐదు లక్షల మందితో వ్యవసాయ కార్మిక, కార్మిక, రైతు, కౌలు రైతులతో పెద్దఎత్తున ప్రదర్శన చేపడుతున్నామన్నారు. ఈ ప్రదర్శనకు రాష్ట్రవ్యాప్తంగా 15 వేలమంది విచ్చేస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో చెరకు రైతులు దివాళా తీశారన్నారు. ఆక్వాను కూడా అదే దారిలో నడిపిస్తోందన్నారు. 75 కేజీల ధాన్యాన్ని రూ.1200కు, రూ.వెయ్యికి, రూ.900కు కూడా అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దీనివల్ల పంట వేసినా ఉపయోగం లేదనే నిరాశలోకి రైతాంగం వెళుతోందన్నారు. కేరళలో ఉన్న వామపక్ష ప్రభుత్వం క్వింటాల్ ధాన్యాన్ని రూ.2940కు కొనుగోలు చేస్తోందన్నారు. స్వామినాధన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తూ, పంట ఖర్చుకు అదనంగా 50 శాతం చెల్లిస్తోందన్నారు. అదే విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ధ్యాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆక్వాలో వచ్చిన సంక్షోభం నుంచి ఎలా బయటపడాలో తక్షణం ఆలోచించించి చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సర్వే గందరగోళంగా ఉందన్నారు. ఈ సర్వేను త్వరగా ముగించేందుకు అదనపు సిబ్బందిని నియమించి సలహాలు, సూచనలు ఇస్తూ సర్వేను పూర్తి చేయాలన్నారు. పంటల బీమా, అధిక వర్షాల నష్టాన్ని, సరైన గిట్టుబాటు ధర అందించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. ఒకవైపు విద్యుత్ సబ్సిడీ తగ్గించడం వల్ల ఛార్జీలు పెరిగాయన్నారు. నాణ్యమైన సీడ్ దొరకడం లేదన్నారు. ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. వీటివల్ల చాలా ఎకరాల్లో రైతులు క్రాప్ హాలిడే ప్రకటించిన పరిస్థితి ఉందన్నారు. అదే విధంగా ఆక్వా పంటను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని పేర్కొన్నారు. ధాన్యాన్ని తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలన్నారు. గిట్టుబాటు ధరతో పాటు, అదనంగా అయ్యే ఖర్చును కూడా ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు సిహెచ్.బాబూరావు, చీర్ల పుల్లారెడ్డి, సహాయకార్యదర్శి తాళ్లూరి రాము, కమిటీ సభ్యులు గుత్తుల శ్రీను, చింతపల్లి లక్ష్మి, బాలం విజయకుమార్ పాల్గొన్నారు.

వేమన పద్యాల గొప్పతనం వర్ణించలేనిది : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో అత్యంత సులభంగా తేలికైన పదజాలంతో రచించిన వేమన పద్యాల గొప్పతనం వర్ణించలేనిదని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో యోగివేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వేమన విగ్రహారాధనకు, కులాలకు, మతాలకు అతీతమని అయన అన్నితరగతులకు చెందిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలియజేశారని, తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. ఆయన రచించిన ఎన్నో పద్యాలు నేటి ఆధునిక యుగంలో చేపడుతున్న పరిశోధనలకు ఆధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అన్ని రకాల సమాజ పరిస్థితులకు అద్దంపట్టేలా వేమన పద్య రచనలు సాగాయని, ఇలాంటి కవి ఉండటం తెలుగు ప్రజలకు గౌరవప్రదమని కొనియాడారు. జెసి జెవి.మురళీ మాట్లాడుతూ యోగివేమన ప్రజాకవి అని, పామరులను, పండితులను అలరించిన ఆయన కవిత్వం ఎంతో గొప్పదని అన్నారు. ఆటవెలది చందస్సులో ఆయన



వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

పద్యాలు రచించారని తెలిపారు. సిపి బ్రౌన్ ఆయన రచనలపై పరిశోధన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి దాసిరాజు, జిల్లా విద్యాశాఖ శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి గణపతిరావు, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు వేగవంతం చేయాలి : గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నియోజకవర్గంలో జగనన్న గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ డిఇ బి.వెంకటరమణతో ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న గృహ నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ సహకారంతో నియోజకవర్గంలో సుమారు 14 వేల మందికి పైగానే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, పట్టాలు ఇచ్చారన్నారు. ఒక్కో గృహనిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల నిధులను ఉచితంగా

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గ్రంధి

మంజూరు చేయడంతో పాటు లబ్ధిదారుల ఇష్టం మేరకు రూ.30 వేలు వరకూ బ్యాంకు రుణాలను కూడా అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో మొదటి విడతగా 6324 గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జగనన్న కాలనీలుగా రూపుదిద్దుకుంటున్న ఈ కాలనీలకు ప్రభుత్వం అన్ని మౌలిక వసతులు కల్పిస్తుందని తెలిపారు. లబ్ధిదారులు తమసొంత ఇంటి కలను నిజం చేసుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అంతేకాకుండా జగనన్న కాలనీలకు తొలుత తాగునీరు, విద్యుత్, అంతర్గత రోడ్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. గృహ నిర్మాణాలపై రోజువారీ పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం జరుగుతుందని అన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేదల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో మూడోరోజు గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పేద బడుగు బలహీనవర్గాలు, చిన్న, సన్నకార రైతులు, కార్మికులు, శ్రామికులు కుటుంబాలకు ముఖ్యమంత్రి జగన్ పెద్దదిక్కుగా ఉన్నారన్నారు తమ కాయకష్టంతో పిల్లలను చదివించుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ఆదుకునే విధంగా వారి పిల్లల చదువులకు సిఎం జగన్ పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇస్తూ మధ్యతరగతి కుటుంబాల కష్టాన్ని పంచుకుంటూ భాగస్వామి అవుతున్నారన్నారు. కాపు సామాజిక



పేదల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి కొట్టు

తరగతికి కాపు నేస్తం ద్వారా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల విశాఖపట్నంలో ప్రధాని పర్యటనలో మరింత చులకన అయ్యారన్నారు. తెలుగుదేశం హయాంలో ఈ గ్రామంలో భూగర్భ డ్రెయినేజీ పనులు చేపట్టి నిధులు దోచుకున్నారని ఆరోపించారు. ఇవ్వని హామీలను సైతం సిఎం జగన్ అమలు చేస్తుంటే గతంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు మాయమాటలతో మోసం చేశారని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు 2024 ఎన్నికల్లో మరోసారి ప్రజల చేతుల్లో గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వి.నరేంద్ర కుమార్, జెడ్‌పిటిసి సభ్యులు ముత్యాల ఆంజనేయులు, ఎంపిపి పి.శేషులత, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్ కుమార్ పాల్గొన్నారు.

విజయలక్ష్మి ట్రస్ట్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాతళ్లమెరక గ్రామంలో విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ భూములు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన వేగేశ్న బాలగణపతివర్మ, వేగేశ్న మాధవరాజు జిల్లా కలెక్టర్, డిఆర్ఒ, తహశీల్దార్, ఎంపిడిఒలకు వేర్వేరుగా గురువారం ఫిర్యాదు చేశారు. వేగేశ్న బాలగణపతివర్మ, వేగేశ్న మాధవరాజు గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రాతళ్లమెరక గ్రామంలో విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనధికార కట్టడాలు నిర్మించారన్నారు. సర్వే నెంబరు 46లో జువ్వలపాలెం-కలవపూడి ఆర్అండ్‌బి రోడ్డు నుంచి పడమర వైపు గ్రామంలోకి వెళ్లే సిమెంట్ రోడ్డుకు దక్షిణం వైపున గల విజయలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ పొడవునా పుంతను ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించడంతో రోడ్డు మార్గం ఇరుకైపోయిందన్నారు. ఈ రోడ్డు మార్గం ద్వారానే చేపల చెరువులకు భారీ వాహనాలతో మేతలను, పట్టుబడి పట్టిన ఆక్వా ఉత్పత్తులను తీసుకెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గమన్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికావడం వల్ల రోడ్డు ఇరుకుగా ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ ట్రస్ట్ అక్రమంగా నిర్మించిన గోడను, సైకిల్ షెడ్డును తొలగించి రోడ్డు మార్గం వెడల్పు చేయాలని ఫిర్యాదు చేశామన్నారు. సర్వే నెంబరు 23లోని గ్రంథాలయం, సర్వే నెంబరు 55లో పుంతను ఆక్రమించి ట్రస్ట్ కార్యాలయ భవనం అక్రమంగా నిర్మించారన్నారు. ట్రస్ట్ ద్వారా చేసే అక్రమాలకు అనుకూలంగా లేని వారి పిల్లలను ఆ ట్రస్ట్ ద్వారా నడుపుతున్న కెవికె.రాజు విద్యానికేతన్ పాఠశాల నుంచి టిసిలు ఇచ్చి పంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో స్కూలు, బస్టాప్, కల్యాణమండపం వంటివి నిర్మించి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు వారు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ట్రస్ట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రగ్స్ దుష్ఫలితాలపై అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాల గురించి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వంచే ఆమోదించబడిన బ్యానర్లన్నీ మున్సిపాల్టీలు, కళాశాలలో ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయలో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖ, అధికారులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజం ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ప్రతి ప్రభుత్వ,

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రయివేటు కళాశాలలో యాజమాన్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్ఫలితాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులను ప్రతి కాలేజీలో ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాల, కళాశాలల సమీపంలో ఉండే పాన్ షాపులు, డ్రగ్స్, లిక్కర్ షాపులను తొలగించాలని సూచించారు. పాఠశాల, కళాశాలలో మోనిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల వాడుతున్న విద్యార్థుల సమాచారం అందజేయాలన్నారు. మెడికల్ షాపుల్లో, మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళి, డిఆర్ఒ దాసి రాజు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం నేత సత్యనారాయణ మృతి

పలువురు సంతాపం

ప్రజాశక్తి - తణుకురూరల్

సిపిఎం తణుకు, భీమవరం తాలూకా కమిటీ సభ్యులుగా పనిచేసిన బొంతు సత్యనారాయణ (73) ఇరగవరం మండలం కొత్తపాడులో గురువారం మధ్యాహ్నం 1 గంటకు మృతి చెందారు. ఆయన 1982లో పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. కొత్తపాడు గ్రామ సర్పంచిగా సత్యనారాయణ ప్రజలకు సేవలందించారు. అలాగే ఆయన భార్య బొంతు లక్ష్మీ సర్పంచిగా సేవలందించారు. సిపిఎం తణుకు డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులుగా సుధీర్ఘ కాలం పనిచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శిగా పనిచేశారు. 1982 శాఖా కార్యదర్శిగా పనిచేశారు. సత్యనారాయణ సోదరుడు బొంతు సూర్యనారాయణ పార్టీ సభ్యులుగా సుధీర్ఘ కాలం

బొంతు సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

కొనసాగారు. సత్యనారాయణ కుమారుడు ప్రస్తుతం ఇరగవరం మండలం సిపిఎం కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. సత్యనారాయణకు ముగ్గురు కుమారులు, ఒక కమార్తె ఉన్నారు. సత్యనారాయణ అంతిమయాత్ర అనంతరం సంతాప సభ జరిగింది. సిపిఎం నాయకులు డి.సీతారామయ్య, కేతా గోపాలన్, పివి.ప్రతాప్, గార రంగారావు, అడ్డగర్ల అయజకుమారి, టిడిపి, వైసిపి నాయకులు కునుకు జనార్ధన్, కొప్పిశెట్టి ప్రసాద్, సిపిఎం మండల కన్వీనర్ బి.నాగబాబు, శాఖా కార్యదర్శి పి.కోటేశ్వరరావు, తొరం వెంకటేశ్వరరావు, పి.సత్యనారాయణ, బొంతు శ్రీనివాస్, గుబ్బల గోపి ఆయన మృతికి సంతాపం తెలిపారు.

తపాల ఉద్యోగి చేతివాటం!

ఖాతాదారుల సొమ్ము స్వాహా

దూసనపూడిలో అధికారుల విచారణ

ప్రజాశక్తి - వీరవాసరం

అవసరానికి ఉపయోగపడతాయని పోస్టాఫీసులో సొమ్ము దాచుకుంటే అది కాస్తా తపాలా శాఖలోని ఓ ఉద్యోగి కాజేసినట్టు ఖాతాదారులు చెబుతున్నారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో భీమవరం తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం గురువారం విచారణ చేపట్టారు. దూసనపూడి పోస్టాఫీసు పరిసర గ్రామాలైన బాలేపల్లి, మత్స్యపురిపాలెం, కమాతలపల్లికి చెందిన పలువురు ఎస్‌బి, ఆర్‌డి, సుకన్య వంటి పథకాల్లో తమ సొమ్మును పొదుపు చేసుకున్నారు. సొమ్ము ఖాతాలో జమ చేసిన తరువాత సెల్‌ఫోన్‌కు రావాల్సి మేసేజ్ రాకపోవడంతో బాధితులు అనుమానం వచ్చి సంబంధిత ఉద్యోగిని ప్రశ్నించారు. ఆ ఉద్యోగి సమాధానం దాటవేయడంతో వారికి అనుమానం వచ్చింది. ఈ విషయం మిగిలిన ఖాతాదారులకు తెలియడంతో వారంతా పోస్టాఫీసుకు వచ్చి ఆరాతీశారు. పలువురి ఖాతాదారుల ఖాతాల్లోని సొమ్ము మాయమైనట్టు గుర్తించారు. ఈ విషయం భీమవరం ప్రధాన తపాలా కార్యాలయ అధికారుల దృష్టికి వెళ్లడంతో ఇన్‌స్పెక్టర్ దూసనపూడి పోస్టాఫీసుకు వచ్చి రికార్డులను పరిశీలించారు. ఖాతాదారుల సొమ్ము ఎంత మేరకు దుర్వినియోగం జరిగిందో తేలిన తరువాత నగదు రికవరీ చేస్తామన్నారు. ఆ తరువాత శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

'కల్లుగీత కార్మికుల పక్షపాతి జగన్'

ప్రజాశక్తి - ఉండి

కల్లుగీత కార్మికుల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్ అని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ గౌడ్ అన్నారు. ఉండిలో గురువారం కల్లుగీత కార్మికులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాలాజీ గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సహజ మరణానికి వైఎస్ఆర్ బీమాకు రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే 'గీతకార్మిక భరోసా' పేరుతో ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచుతూ జిఒ 21 ఇచ్చి మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కల్లుగీత వృత్తి కులాలైన గౌడ, శెట్టిబలిజ, శ్రీశైన, యాత, ఈడిగ వారికి ప్రభుత్వంలో ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వడమేకాకుండా, లోకసభ, రాజ్యసభలకు, ఆంధ్రప్రదేశ్ చట్టసభల్లోకి పంపిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు.

బ్యాంకులకు వరుస సెలవులు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 26వ తేదీ నుంచి వరుసగా బ్యాంకులకు సెలవు. ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా బ్యాంకులకు సెలవు. 27న బ్యాంక్ పనిచేస్తుంది. 28వ తేదీ శనివారం, 29వ తేదీ ఆదివారం బ్యాంకులకు సెలవు. అలాగే 30, 31వ తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో వరుసగా 6 రోజుల్లో కేవలం 27వ తేదీ మాత్రమే బ్యాంకులు పనిచేస్తాయి.



రంగనాథరాజును సత్కరిస్తున్న వైసిపి నాయకులు

విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

ఇంటర్న్‌షిప్ చేసే విద్యార్థులకు ప్రభుత్వం స్టైఫండ్ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ అధ్యక్షులు ఎండి.జాన్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానంలో భాగంగా డిగ్రీ 3వ సంవత్సర విద్యార్థులకు చేపట్టే 'ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ కనెక్ట్'కు చేయడానికి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వైఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరత్నంకు గురువారం వినతిపత్రం అందజేశారు. మొదటిసారి డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రక్రియ ప్రవేశపెట్టడం, దీనిపై అనుభవం

వైస్ ప్రిన్సిపల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. సుమారు నెల రోజుల్లో ఇంటర్న్‌షిప్ ప్రక్రియ ప్రారంభం కానుందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వులపై క్షేత్రస్థాయిలో విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. కళాశాలలో ఇంటర్న్‌షిప్ పట్ల సమాచార సహాయ కేంద్రాన్ని (హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇ.సన, చిరంజీవి, దేవిసాయి, పావని పాల్గొన్నారు.

పెనుమంట్రలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - పెనుమంట్ర

నవరత్న పథకాల ద్వారా ప్రతి ఇంటిలో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు కోరారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం పెనుమంట్రలో రెండో రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగనాథరాజు మాట్లాడుతూ జగన్ పాలనను లబ్ధిదారులు మరువరాదన్నారు. బిడ్డ వయసు నుంచి వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలన్నారు. అనంతరం ఎంఎల్ఎను నేతలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతి రాజు వెంకట శ్రీనివాసరాజు, ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి), జెడ్‌పిటిసి సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, వైస్ ఎంపిపి వాసంశెట్టి కిరణ పాల్గొన్నారు.

మొగల్తూరులో వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా వేమన జయంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ అధ్యక్షతన యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ ప్రతినిధి బి.జనార్దన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శశికళ, చంద్రకళ, బొక్కా భవానీ దుర్గ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

మొగల్తూరు : వేమన నీతి శతకాల ద్వారా ప్రపంచానికి ఉత్తమ బోధనలు అందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి వర్మ విద్యార్థులకు సూచించారు. గురువారం మండలంలోని నీటిపేట గ్రామంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధీర్, శ్రీలత, సంగడి రాజు, శ్రీనివాస్, షకీరున్నీసా పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగి వేమన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ పీర్ సాహెబ్ వేమనకు నివాళులర్పించారు. సమాజంలో నెలకొన్న అసమానతలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా తన పద్యాలతో వందల ఏళ్ళ పూర్వమే జనాన్ని జాగృతం చేసిన సంఘ సంస్కర్త యోగివేమన అని చెప్పారు. అనంతరం యోగి వేమన పద్యాల పై విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిలుకూరి పద్మశ్రీదేవి, గొల్ల మండల రాజు, వలవల రాజేశ్వరి, చూడం వీరస్వామి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : విద్యార్థులకు బహుమతులు అందజేత

22న ఛాంబర్స్‌లో స్కాలర్‌షిప్ టెస్ట్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కెవిఎం ఛాంబర్స్ జూనియర్ కళాశాలలో ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు 10వ తరగతి విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు, సెక్రటరీ కలిదిండి రామరాజు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ టెస్ట్ విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలను గుర్తించేందుకు, రాబోయే 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలలో మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.20,000, రెండో బహుమతిగా రూ.15,000, మూడో బహుమతిగా రూ.10,000, 11 కన్సోలేషన్ బహుమతులు ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున ఫీజు రాయితీ రూపంలో ఇవ్వబడుతుందని చెప్పారు. పరీక్షకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదన్నారు. పరీక్షకు హాజరయ్యే నాన్ లోకల్ విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు వివరాలను కళాశాల ఆఫీసులో సంప్రదించాలని కోరారు.

విద్యార్థినులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు

విద్యార్థినులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

కిశోర బాలికలు తరచూ రక్త పరీక్షలు చేయించుకోవాలని వీవర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు జాన్ లియో చెప్పారు. పిహెచ్‌సి పరిధిలోని బివిఆర్‌ఎంవి హైస్కూల్లో విద్యార్థినులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 10 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లల్లో రక్త హీనతను నిర్ధారించడానికి హెమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఐరన్ మాత్రలు పంపిణి చేసి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం, ల్యాబ్ టెక్నీషియన్, ఆశాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ప్రసాద్

మారంపల్లిలో 'పొలంబడి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మారంపల్లిలో వాడపల్లి రమణరాజు పొలంలో గురువారం పొలంబడి నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాట్లు వేసిన 40 రోజుల నుంచి కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దని, సూటి ఎరువులు వాడకం మంచిదని తెలిపారు. కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వాడొద్దని, వ్యవసాయ శాఖ సూచించిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని తెలిపారు. ఈ సమయంలో గుళికలు వేసుకోవడం మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు రామకృష్ణంరాజు, లక్ష్మీపతిరాజు, మండల వ్యవసాయ అధికారి ప్రసాద్, ఆర్‌బికె అసిస్టెంట్ జె.సతీష్, ఎఇఒ మాధవ వర్మ పాల్గొన్నారు.

నేడు మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

వంతెన దాటాలంటే.. వణుకే..!

శిథిలావస్థకు తాడేరు వంతెన - హడలిపోతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - ఆచంట

దశాబ్దాల పాటు ప్రయాణికుల అవసరాలు తీరుస్తున్న పలు వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దీంతో ఆయా వంతెనలపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళన గురవుతున్నారు. వంతెన శ్లాబులతోపాటు గోడల దెబ్బతినడంతో ఎప్పుడు కుప్ప కూలిపోతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. వంతెనలు ఇంత ప్రమాదకరంగా ఉన్నా ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు లేదు. కూలిపోతే గాని పట్టించుకోరా అంటూ వాహనదారులు, ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

తాడేరు డ్రెయిన్‌పై శిథిలావస్థకు చేరిన వంతెన

మండలంలో పలు మురుగు డ్రెయిన్లపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. ఈ నేపథ్యంలో ఆయా వంతెనలపై ప్రయాణానికి వాహనదారులు భయపడుతున్నారు. వంతెనలు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో అవి ఎప్పుడు కూలిపోతాయో అర్థం కాని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. శిథిలమైన వంతెనల స్థానే కొత్తవి నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలోనూ, ఈ ప్రభుత్వంలోనూ పలుసార్లు కోరినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. మార్టేరు- కోడేరు స్టేట్ హైవే ఆర్‌అండ్‌బి రహదారిలో ఆచంట శివారు కోరుపాలెం వద్ద తాడేరు మీడియం డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. నాలుగు దశాబ్దాల క్రితం ఈ వంతెన నిర్మించారు. వంతెన శ్లాబ్‌తో పాటు గోడలు బీటలు వారాయి. మార్టేరు - కోడేరు ఆర్‌అండ్‌బి రహదారి విస్తరణ చేసిన గత ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణాన్ని మాత్రం గాలికొదిలేసింది. ప్రధాన రహదారి కావడంతో ఈ వంతెన మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.

వల్లూరు భీమలాపురం వెళ్లే రహదారిలో వల్లూరు మీడియం డ్రెయిన్ పై 1967లో వంతెన నిర్మించారు. వంతెన అడుగు భాగంలో శ్లాబ్ దెబ్బతిని బీటలు వారింది. ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. వంతెనకు ఇరువైపులా రెయిలింగ్‌లు కూడా దెబ్బతిన్నాయి. ఈ వంతెన గుండా నిత్యం వల్లూరు, భీమలాపురం ప్రజలతోపాటు యలమంచిలి మండలానికి చెందిన పలు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. అయితే వంతెన పరిస్థితి రోజురోజుకూ దిగజారి ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వాటి స్థానే కొత్త వంతెనలు నిర్మించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

భయమేస్తోంది..

పెచ్చెట్టి శివ, వాహనదారుడు, పెనుమంచిలి

ఆచంట శివారు కోరుపాలెం వెళ్లే రహదారిలో తాడేరు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన పూర్తిగా దెబ్బతింది. ఈ వంతెన శ్లాబ్‌తో పాటు గోడలు దెబ్బతిన్నాయి. ఈ వంతెన ఏ క్షణంలో కూలిపోతుందోనని భయమేస్తోంది. ప్రభుత్వం స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెన స్థానే కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

ప్రభుత్వం వంతెన నిర్మించాలి

వద్దిపర్తి శ్రీనివాస్, వాహనదారుడు, ఆచంట

రోజూ తాడేరు వంతెన మీదుగా అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన శ్లాబ్‌తో పాటు గోడలు బీటలు వారాయి. ప్రమాదకరంగా ఉంది. వంతెన మీదకు చేరుకునేసరికి భయం వేస్తోంది. తక్షణం ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

ఏలూరుపాడు జట్టు విజయం అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల్లో పురుషుల కేటగిరిలో సీనియర్ విభాగంలో మొదటి బహుమతి, జూనియర్ విభాగంలో ఐదో బహుమతి ఏలూరుపాడు జట్టు గెలుపొందడం అభినందనీయమని ఏలూరుపాడు లయన్స్ క్లబ్ అధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ అన్నారు. గురువారం గెలుపొందిన వారిని గ్రామ పెద్దలు అభినందించి ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల సంక్రాంతి సందర్భంగా ఆకివీడు హైస్కూల్ గ్రౌండ్‌లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పురుషుల చెడుగుడు పోటీల్లో ఏలూరుపాడు టీమ్ సీనియర్ విభాగంలో మొదటి బహుమతి, జూనియర్ విభాగంలో ఐదో బహుమతి సాధించాయి. క్రీడా దుస్తుల నిమిత్తం మంతెన వెంకట రవివర్మ రూ.5 వేలు అందజేశారు. దాట్ల వాసురాజు (సెక్యూరిటీ వాసు) క్రీడాకారులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరుపాడు లయన్స్ క్లబ్ మంతెన వెంకట రవి వర్మ, దాట్ల వాసురాజు (సెక్యూరిటీ), దందు సుబ్రహ్మణ్యంరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న ఏలూరుపాడు గ్రామ పెద్దలు

నిర్మాణంలో ఉన్న ట్యాంకు

నత్తనడకన ట్యాంకుల నిర్మాణం..!

తాగునీటికి పట్టణవాసుల అవస్థలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో 4 సంవత్సరాలుగా చేపడుతున్న రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు నత్తనడకగా సాగుతున్నాయి. పనులు పూర్తికాకపోవడంతో ఈ వేసవిలోనైనా పాలకొల్లు మున్సిపల్ ప్రజల దాహం తీరుస్తారా స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పాలకొల్లు మున్సిపల్ కుళాయి నీటికి ఎంతో ప్రాధాన్యత ఉంది. పరిసర గ్రామాలకు చెందిన వేలాదిమంది పాలకొల్లు వచ్చి కుళాయినీరు తీసుకెళ్తారు. అయితే నాలుగు సంవత్సరాలుగా దీని నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వచ్చే ఏడాది ఎన్నికల జరుగుతున్న వేళ ఎలాగైనా దీన్ని ప్రారంభించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కవురు శ్రీనివాస్ భావిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా కనీసం తాగునీరు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదని కవురు శ్రీనివాస్‌ను ప్రజలు విమర్శిస్తున్నారు.

టిడిపి హయాంలోనే రూ.15 కోట్లతో పనులు ప్రారంభించారు. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయినా కనీసం నేటికీ లింకు ఇవ్వకపోవడంతో పట్టణ ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. అలాగే పట్టణ శివారు ప్రాంతాలకు తాగునీరు అందక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని వార్డుల్లో మహిళలు కమిషనర్ వద్దకు వచ్చి ఆందోళన కూడా చేశారు. అయితే కాంట్రాక్టర్ చేసిన పనికి బిల్లులు ఆలస్యం కావడంతో కాంట్రాక్టర్ నత్తనడకగా పనులు చేస్తున్నారు. రూ.15 కోట్లతో టిడిపి హయాంలో పట్టణంలోని బెత్లహంపేట, హౌసింగ్ బోర్డులో రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం మొదలుపెట్టారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులతో కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పనులు ఆలస్యం అయ్యాయి. ఈ రెండు ట్యాంకుల నిర్మాణం పూర్తయిన బ్రాడీపేటలో ఉన్న పంప్ హౌస్ వద్ద పనులు కూడా నత్తనడకగా పూర్తయ్యాయి. దాదాపు దీని నిర్మాణం పూర్తయిన పంప్ హౌస్ వద్ద క్లోరిన్ ప్లాంట్ లో సిలిండర్లు, ఇతర మిషనరీ ఏర్పాటు చేయాల్సి ఉంది. సుమారు రూ.50 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా. అయితే ఇంకా కాంట్రాక్టర్‌కు కోటి రూపాయలకు పైగా బిల్లులు చెల్లించకపోవడంతో పనులు సాగని పరిస్థితి నెలకొంది.

సచివాలయాల్లో ఆధార్ సేవలు

పాలకోడేరు: మండలంలోని పాలకోడేరు-1, శృంగవృక్షం-1, పెన్నాడ సచివాలయాల్లో ఆధార్ సేవలు ప్రారంభిస్తున్నట్లు ఎంపిడిఒ ఎన్.మురళీ గంగాధరరావు గురువారం తెలిపారు. పాలకోడేరు-1 సచివాలయంలో శుక్రవారం నుంచి సేవలు ప్రారంభమవుతాయని, మిగిలిన రెండు చోట్ల త్వరలోనే సేవలు ప్రారంభమవుతాయన్నారు. ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు ఆయా సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. సచివాలయాల్లో ప్రారంభిస్తున్న ఆధార సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోటీలను ప్రారంభిస్తున్న స్కూల్ డైరెక్టర్ ప్రకాష్‌రావు

మాంటిస్సోరీలో క్రీడా వార్షికోత్సవం

ప్రజాశక్తి - తణుకు

స్థానిక మాంటిసోర్నీ స్కూల్లో 34వ క్రీడా వార్షికోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత క్రీడాజ్యోతిని వెలిగించి స్కూల్ డైరెక్టర్ ప్రకాష్‌రావు పోటీలను ప్రారంభించారు. దీనిలో భాగంగా పరుగుపందెం, గ్లోబల్ వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. అనంతరం ప్రకాష్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొని సమదృష్టితో స్వీకరించాలన్నారు. నేటి ఓటమి రేపటి విజయానికి తొలిమెట్టని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పైళ్లమ్మ సన్నిధిలో శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

చిలుకూరు గ్రామంలోని పైళ్లమ్మ అమ్మవారి జాతర సందర్భంగా మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ముదునూరి వెంకట సోమరాజు, నాయకులు చేకూరి బోసురాజు, జుత్తుగ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అఖండ అన్న సమారాధనలో శివరామరాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గ్యాస్ సిలిండర్ పేలి తాటికిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆచంట

వల్లూరు గ్రామంలో గురువారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలి తాటాకిల్లు దగ్ధమైంది. వల్లూరు గ్రామానికి చెందిన వాడపల్లి పెద్దింట్లు గురువారం రాత్రి ఇంట్లో గ్యాస్‌పై వంట చేస్తుండగా అకస్మాత్తుగా సిలిండర్ పేలడంతో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికి ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పాలకొల్లు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకూ ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనావేశారు. ప్రమాద స్థలాన్ని ఎస్ఐ ప్రసాద్ పరిశీలించారు.

వేర్వేరు కేసుల్లో పలువురికి జైలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వేర్వేరు కేసుల్లో ముద్దాయిలకు ఒక్కొక్కరికి ఏడాది జైలు, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ తాడేపల్లిగూడెం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి, రెండో అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ సిహెచ్.రమ్య గురువారం తీర్పునిచ్చారు. చెక్ బౌన్స్ కేసులో ముద్దాయిలు మద్దాల వీరేంద్ర, రావుల నాగేశ్వరరావుకు, హరిలలిత రత్నకుమారి కేసులో ముద్దాయి కొమ్మన రాముడుకు రూ.5000 జరిమానా విధించారు.

యువకుడు అనుమానాస్పద మృతి

పాలకొల్లు: పాలకొల్లు రైల్వే గేట్ సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. యువకుడు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బ్రాందీ షాపు వద్దకు వచ్చి మద్యం అడిగాడని, డబ్బులు లేకుండా మద్యం ఇవ్వలేమని షాపు మేనేజర్ చెప్పాడు. ఆ తరువాత యువకుడు షాపు వద్ద 2 గంటల పాటు కూర్చుని ఉన్నాడు. తరువాత స్పృహ కోల్పోయాడు. అనుమానం వచ్చి స్థానికులు 108కి ఫోన్ చేశారు. వారు వచ్చేసరికి అతడు మృతి చెందాడు. యువకుడు 25వ వార్డుకు చెందిన ధర్మవరపు శ్రీనివాస్‌గా గుర్తించారు. దీనిపై ఎక్సైజ్ సిఐను వివరణ అడుగగా దీనిపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుమ్మలూరులో చోరీ

పోడూరు: గుమ్మలూరులో దుండగులు చోరీకి పాల్పడ్డారు. దీనిపై ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం. గుమ్మలూరులో యండమూరి మంగ ఆమె భర్త వెంకట్రావు నివాసం ఉంటున్నారు. వెంకట్రావు ఆర్టీసి కండక్టర్‌గా పని చేస్తున్నారు. అయితే మంగ ఇటీవల హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి దగ్గర ఎవరు లేని సమయంలో దొంగలు తాళాలు పగలగొట్టి లోపల బీరువాలోని 118 గ్రాముల బంగారం ఆభరణాలు, రూ.7 లక్షల నగదు అపహరించారు. తిరిగి ఆమె 13వ తేదీన గుమ్మలూరు వచ్చేసరికి చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేయగా సిఐ శ్రీనివాస్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. గురువారం జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్, డిఎస్‌పి మనోహరచారి విచారణ చేపట్టారు.

బహిరంగ ప్రకటన

ఈ ప్రకటన మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా.., నా క్లయింట్ అయిన **దేవరపల్లి కవిత, భర్త: శౌరీప్రసాద్** గారు పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు సబ్ రిజిస్ట్రీ, 28వ డివిజన్ లోని, రామరాజు భూషణం వీధి, టి.యస్.నెం. 18పి, 21పి, ప్లాటు నెం.55-బి, 606-00 చ॥గ॥లలో నిర్మించుకున్న విజయ ఎన్‌క్లేవ్ అపార్ట్మెంట్ నందు మూడవ ఫ్లోర్‌లోని ఫ్లాట్ నెం. 301 ఫ్లాటును క్రయం పొందుటకు నిర్ణయించుకుని 24-03-2022వ తేదీన రాంపల్లి సుబ్బారాయుడు గారి భార్య శ్రీమతి రాంపల్లి సత్య జ్ఞాన ప్రసూనాంబ తరుపున డెవపల్మెంట్ అగ్రిమెంట్ కమ్ జనరల్ ఆఫ్ అటార్నీ ఏజెంట్ అయిన శ్రీ బొమ్మగంటి నాగేశ్వరరావుగారి కుమారుడు బొమ్మగంటి ఫణికుమార్ మరియు విజయ కన్స్ట్రక్షన్ వారి నుండి క్రయ అగ్రిమెంట్ను పొందియున్నారు. సదరు షెడ్యూలు దాఖలా స్థలమునకు సంబంధించిన ది.05-12-1951వ తేదీన శ్రీ రుద్రపాక వియ్యేశ్వరశర్మ గారు క్రయం పొందిన ఒరిజినల్ దస్తావేజు నెం.4427/1951 లోగడనే గైర్వలయ అయినదని స్థల యజమానులు తెలియపరచి యున్నారు. మా క్లయింటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏలూరు బ్రాంచి నందు పై ఉదహరించిన షెడ్యూలు దాఖలా ఫ్లాటును క్రయం పొందుటకు ఋణం మంజూరు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. కావున సదరు బ్యాంక్ నుండి (వారికి సంబంధం చిన కార్యకలాపములు) ఋణం పొందు వ్యవహారం యందు ఎవ్వరికైననూ ఎటు వంటి అభ్యంతరములు, ఆక్షేపణలు, క్లయిములు ఉన్న యెడల ఈ క్రింది అడ్రస్ గల వారికి లిఖితపూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా ఈ ప్రకటన వెలువడిన పదిహేను (15) రోజులలోగా తెలియపర్చవలసినదిగా కోడరమైనది.
ఏలూరు, ది.18-01-2023.

బి.వి.అప్పారావు
అడ్వకేట్, సాయిబాలాజీ థియేటర్ వద్ద, 1టౌన్, ఏలూరు, సెల్: 94401 88346

హుండీ ఆదాయం లెక్కిస్తున్న సభ్యులు

ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి దండు వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు దండు వెంకట కృష్ణంరాజు, గ్రామస్తులు, ఏలూరుపాడు మహిళా మండలి జ్ఞానానంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. 101 రోజులకు హుండీ లెక్కింపు నిర్వహించగా రూ.24,43,990 ఆదాయం వచ్చిందని ఇఒ సురేష్ నాయుడు తెలిపారు.

NAME CHANGE

I ABDUR RAHMAN, S/o. ATAUR RAHMAN QURESHI, R/o. 1-15-11, Opp. RTC Complex, Beside Masjid, Yadavallivari Street, Tadepalligudem, West Godavari Dist., Andhra Pradesh, have changed my name from **ABDUR RAHMAN** (Old Name) to **ABDUR RAHMAN QURESHI** (New Name). Hence forth I am being called as **ABDUR RAHMAN QURESHI** (New Name) for all purposes.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 734, 735, 736/2022
in O.S.No. 24/2014
పిటీషనర్: రాట్నాల శ్రీనివాసరావు
రెస్పాండెంట్లు: రాట్నాల రత్నమాణిక్యం, అదర్స్
R-7: Maragani Pavani Srilatha, W/o. Srinivas (Late)
R-8: Kamineni Meena Manvi, W/o. Not Known.
R-9: Maragani Hitishi, D/o. Srinivas (Late) Residence of Bhaskar Heihts Apartments, Backside of Xovei Boys Canvent, Flat No. 302, Vidya Nagar, Eluru, Eluru District.
ఈ పై ఐ.ఎ.నెంబర్లులో R-7 to R-9 రెస్పాండెంట్లు నోటీసు అందుకొనకుండా కాలయాపన చేయుచూ వచ్చుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు **ది.27-01-2023 తేదీన వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు కోర్టు వారి ముందు హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను.** లేని ఎడల కోర్టు వారు పై ఐ.ఎ. నెంబర్లను మీ పరోక్షమున తీర్మానించబడును.
YERRA VENKATA NARASIMHA RAO
DATTALA WILLINGSTON
Advocates, Bhimavaram

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE :: ELURU WEST GODAVARI DISTRICT
I.P.No. 12/2022
Between:
1) Addagalla Srinivasa Rao
2) Addagalla Subhashini
...Petitioners /Debtors
VS
Nerusu Vijaya and 31 Others
...Respondents /Creditors
TO:
R-14: Bendedi Swarnalatha, W/o. Chandra Mohan, R/o. D.No. 6-3-2, Near Markendiya Swami Temple, Dhakshinapuveedhi, Eluru, W.G.Dt.
R-18: Gadhipenta Lakshmi, W/o. Apparao, R/o. D.No. 11/2, Madepalli, Eluru, W.G.Dt.
R-22: S.Durga, R/o. D.No. 2B-1-7, Near K.K.R. School, sartampadu, Eluru, W.G.Dt.
R-23: G.Ganga, R/o. D.No. 2A-1-3, Near K.K.R. School, Satrampadu, Eluru, W.G.Dt.
Where as, the Petitioners filed petition to declare them as an insolvents, the Hon'ble Court was pleased to ordered notice to you. Therefore you are informed to appear before the **Hon'ble Court on 20-01-2023 at 10:30 A.M.** else the matter will be decided according to law.
P.VENKATA RAJU,
Advocate, Eluru.

In The Court Of The Addl. Senior Civil Judge :: Eluru
E.P.No. 20/2020
O.S.No. 37/2016
Between:
Agireddy Jaya Lakshmi ...D.H.R
AND
Midatani Naga Mani ...J.D.R
వేలం ప్రకటన
పై నెంబరు గల ఇ.పి.లో ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థిని **ది.15-02-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు వేలం వేయబడును.** వేలంలో పాల్గొనవలసిన వారు (ఆసక్తి కలవారు) పై కోర్టు ఎదుట ది.15-02-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు ఆధారు కార్టు ఒరిజినల్ మరియు 1/4 అమౌంటు తో హాజరు కావలెను.
E.P. SCHEDULE PROPERTY
An extent of 28-7-10 Sq. Yards Site and a RCC Roof Shed house in the Ground Floor and a Tiled House Ist Floor herein bearing D.No. 20F-16-13, Assessent No. 33704 in T.S.No. 1216 situated in chodidibba, 49th Division, Eluru, Sub Division Eluru Municipal Corporation, W.G.District Within the following boundaries:
East: Joint Wall of Mutta Satyavini's House and This House.
South: Joint Wall of Nagarapu Paidamma's House and this House.
West: Joint Wall of Gulipalli Ramu's House and This House.
North: Road.
DHR Value : Rs.5,00,000/-
Amina Value : Rs.6,00,000/-
Be Pleased to Consider
K.BHASKARA RAO,
P.SRINIVASA RAO,
Advocates for DHR,
Eluru, 19-01-23. Eluru.